# విధివాత

2

## శ్రీ కొండముది హనుమంతరావు

అదేపనిగా గోలపెట్తోన్న టెలిఫోన్‌రింగ్సుక అరుణ బాహ్యలోకంలోకి వచ్చిపడ్డది. చెంపల మీదుగా కన్నీరు బొట్లు బొట్లుగా జారుతోంది! గుండె బరువుగా ఉంది. గొంతులో పుండు లేచినట్లుగా ఉంది.

నిద్రలేచిన పిల్లవాడు వుయ్యాలలో మంచి లేవదీసి ఎత్తుకునేదాకా ఏడ్పు మాననట్లు రిసీవరు తీసేదాకా టెలిఫోన్ రింగ్ చేస్తూనే ఉంటుంది.

బరువుగా అడుగులేస్తూ వెళ్ళి ఫోన్ ఎత్తిన అరుణ మనోపథంలో సాయంత్రం సుధాకర్ రింగ్ చేసి మాట్లాడిన సంఘటన మెరుపులా మెరిసింది. ఉలిక్కిపడి రిసీవరు క్రిందపెట్టేసింది.

టెలిఫోన్ డిస్‌కనెక్ట్ అయిపోయింది.

అరుణ నిస్సహాయంగా ఫోన్ వంక చూస్తూ కూర్చుంది.

ఈసారి టెలిఫోన్ లాంగ్‌రింగ్స్ ఇస్తోంది— ట్రంక్‌కాల్‌లాగా. ఎంతసేపు తను తప్పించుకోదు రింగ్‌నుంచి. తననుభవించాల్సిన శిక్ష తనని హంట్ చేస్తోంది. ధైర్యంచేసి రిసీవర్ తీసింది.

డాక్టరు ప్రకాశం కావాలిట — ఓ ముసలి గొంతు !

రాంగ్ నంబరు! బహుశా టెలిఫోన్ ఎక్ఛేంజ్‌లోని ఆపరేటర్ నిద్రమత్తులో రాంగ్ నంబరు కనెక్ట్‌చేసి ఉంటుంది — తను ఒక విధమైన భ్రాంతిలోపడి రాంగ్ పాత్‌లో అడుగు పెట్టినట్లుగా!

కిటికీలోంచి విసురుగా వీచిన గాలి డైరీ పుటలు రెపరెప కొట్టుకొని మూసుకుపోయాయి. అరుణ 1959 డైరీ తీసింది. అందులోని కొని ఎంట్రీలు.....

3, ఫిబ్రవరి 1959.

కళ్ళు తెరచి చూచేసరికి అమ్మా, నాన్నగారు ఆ దుర్దాగా నా మొహంలోకి చూస్తున్నారు. ఎక్కడ వున్నానో ఏమిటో, అర్థం కాక చుట్టూ చూశాను. హాస్పిటల్ వార్డులో మంచం మీద. డాక్టర్ ప్రకాష్,పక్కన చార్ట్ పట్టుకున్న నర్స్.

వాళ్ళందరి కళ్లలో వెలుగు రేఖలు— తను కళ్ళు తెరిచేసరికి.

ఏం జరిగింది? గుర్తుకు తెచ్చుకున్నాను....

మధ్యాహ్నం బాల్కనీలోకి పోయాను. ఏదో ఏరో ప్లేన్ ఎగురుతూన్న శబ్దం వినిపిస్తోను. చాలా క్రిందగా పోతోంది. గిరగిరా తిరుగుతున్న ప్రొఫెల్లర్స్ కన్పిస్తున్నాయి కూడాను. అందులోంచి ప్రొఫెసర్ తొంగి చూస్తున్నట్టుగా కన్పించింది. పిలుస్తున్నట్లుగా విన్పించింది. ఆ భ్రాంతిలో ఏం చేశానో తెలియదు. బహుశా పైకి పైపైకి చూస్తూ ముందుకు నడిచి వుంటాను ఆ ఉద్రేకంలో బాల్కనీ గోడ నాకడ్డుగా కన్పించి వుండదు. గోడ తగిలి క్రిందపడిపోయి వుంటాను అంతెత్తునుంచి...

గాయాలు తగిలాయేమోనని తల తడుముకునేందుకు చేయి ఎత్తానో లేదో డాక్టర్ ప్రకాష్ ఎత్తిన చేయి పట్టుకొని—

''డోంట్ వర్రీ! పెద్ద దెబ్బలేమీ తగల్లేదు'' అన్నారు.

''ఎలా వుందమ్మా అరుణా ఒంట్లో''అంటూ అమ్మ నుదుట మీద చేయి వేసింది.

నీరసంగా వుంది. మాట్లాడే ఓపిక కూడా లేదు. కళ్ళు మూతలు పడిపోతున్నాయి.

''ఫర్వాలేదు. నీరసంగా వుంది. హార్లిక్స్ యండి''

డాక్టర్ ప్రకాష్ సలహా యిచ్చి వెళ్లిపోతున్నట్లు బూట్ల శబ్దం తెలుపుతోంది కళ్ళు మూసుకున్న నాకు.

15, మార్చి 1959.

తల పూర్తిగా నయమైంది. బాండేజి విప్పేశారు. అమ్మ కెంతో సంతోషమైంది.

''నీ ఋణం ఎలా తీర్చుకుంటామో నాయనా'' చిన్నప్పటినుంచి ఎరుగున్న డాక్టర్ ప్రకాష్‌కు కృతజ్ఞత చెప్పుకుంటోంది అమ్మ.

''దానికేముందండీ. యిది మా డ్యూటీ'' అంటూ డాక్టర్ ప్రకాష్ నవ్వారు. నాన్నగారు ఫీజు నల్లి రూపాయలివ్వబోతే తీసుకోలేదు.

''ఎలా వుంది అరుణా?'' స్టెతస్కోప్ చేత్తో వూపుతూ అడిగారు డాక్టర్.

''బాగానే వుంది.''

''ఇంట్లో కూర్చునేకంటే సాయంత్రాలు అలా బయటికి పోతే ఒంటికి మంచిది.''

అమ్మ చేజిక్కిన అవకాశం జారవిడువదల్చుకోలేదు.

''నేను పెద్ద చదువులు చదివిన దానిని డాక్టరీ ప్యాసయిన దానిని కాక పోయినా చెప్తూనే వున్నాను. చేజారి పోయిన సుఖం గురించి ఇరవై నాలుగు గంటలూ ఆలోచించకే — ఆరోగ్యం చెడిపోతుంది — అని. కాని నామాట వింటేగా! కాసేపు సాయంత్రం పొద్దైనా అలా వ్యాహాళికి దగ్గరకు పోయి వస్తుండవే — అంటే లెక్కచేయదు గదా? నువ్వయినా చెప్పు నాయనా వింటుందేమో!''

అమ్మ ధోరణికి డాక్టర్ ప్రకాష్ నన్నగా నవ్వి —

''అవును — మీ అమ్మ అనేది నిజమే. నాకిప్పుడు పనేమీ లేదు. నీకేమి అభ్యంతరం లేకపోతే రా అరుణా అలా వెళ్లివద్దాం'' అన్నాడు డాక్టర్.

''పోయి రా అమ్మాయి. తప్పేమీ లేదు. డాక్టర్ ప్రకాష్ మనకు పరాయి వాడేమీకాడు'', నాన్నగారు అమ్మ వాదనని బలపరుస్తున్నారు.

అపాయం నుంచి ప్రాణం కాపాడిన మనిషి ఆహ్వానిస్తున్నారు. అమ్మా, నాన్నగారూ వెళ్ళు, తప్పులేదంటున్నారు. బహుశా సుందర సంధ్యా సమయాల్లో ఇంట్లో ఒంటరిగా కూర్చుని నాలో నేను కుమిలి పోవటం చూస్తుంటే వారి హృదయాలు కమిలి పోతున్నాయేమో! నెలా పది హేను రోజుల నుంచి మంచం మీదవున్నా నాయిను కాళ్ళు కుదుళ్ళు పట్టుకుపోయాయి.

వెళ్దామని నిర్ణయించుకున్నాను.

లోపలికి పోయి — తొడుక్కున్న తెల్లని జాకెట్టు కన్పడకుండా తెల్లని వాయిల్ చీర పమిట నిండుగా కప్పుకొని ముడి వేసిన కొప్పూ బోసిమెడతో వచ్చేసరికి ముగ్గురూ ఆశ్చర్య పోయారు. జడవేసుకుని పూలు పెట్టుకుంటానని వారాశించక పోయినా సొమ్ములు పెట్టుకొని ఏవైనా రంగు దుస్తులు వేసుకుని వస్తానని ఎదురుచూసి వుంటారేమో, ముగ్గురి నోటా మాట రాలేదు.

నేను వెనుక సీటులో కూర్చున్నాను. డాక్టర్



సౌమిత్ర

ప్రకాష్ స్టీరింగు ముందు కూర్చున్నాడు.

కారు మెల్లగా సాగి గవర్నరుపేట సెంటరు దాకా వచ్చింది.

"ఎటు పోదామంటావు అరుణా?"

"డాక్టరు రమ్మన్నారు కదా అని, అమ్మ, నాన్న గారు వెళ్లమన్నారు కదా అని కారెక్కాను కాని ఎక్కడికి పోవాలి? డాక్టరుతో యీ సాయంత్రం ఎలా గడపాలి? అని ఆలోచించుకోలేదు. ఇప్పుడు డాక్టర్ ప్రకాష్ "ఎటు పోదామని" ప్రశ్నించేసరికి అదో సమస్యగా కన్పించింది నాకు.

"మీ యిష్టం." అంతకన్న వేరే ఛాయిస్ కన్పించలేదు. మరి!

"కృష్ణా బేరేజికి పోదామా — చల్లగా వుంటుంది"

"అలాగే"

లక్ష్మీ టాకీస్... ఆర్. టి. సి. బస్ స్టాండ్... రైల్వే అండర్ బ్రిడ్జి.... దాటి కారు పాత బెజవాడలో ప్రవేశించింది.

నా హృదయంలో ఘోషకు తాళం వేస్తోంది కృష్ణహోరు.

బెజవాడకు ఏవిధమైన బీచ్‌గాని, మంచి పార్కుగాని, లేకపోవటంతో యీ రెగ్యులేటర్ బ్రిడ్జి దగ్గరకే చాలా మంది షికారుకు వస్తున్నట్లున్నారు. సోడాలు, మిరపకాయ బజ్జీలు, తంపట వేరుశనక్కాయలు, అమ్మేవాళ్ళ వ్యాపారంకూడా ప్రారంభించారు.

బ్రిడ్జికి ఆ చివరిదాకా తీసికెళ్లి కారాపారు డాక్టర్ ప్రకాష్.

ఇద్దరమూ దిగి కూర్చున్నాము.

పశ్చిమాకాశం చేరిన ప్రభాకరుడు పసిడి రంగు వెదజల్లుతున్నాడు. పదహారు వన్నెల బంగారంతో ప్రత్యేకంగా నేయించుకున్న చీర ధరించి, కొత్తగా వేయించుకున్న గాజులు గల గలమనిపిస్తూ కృష్ణవేణి పరుగులు తీసుకుంటూ వస్తోంది. పక్షులు జంటలు జంటలు గానూ, గుంపులుగానూ ఎదురేగి స్వాగతం పలుకుతున్నాయి.

నిజంగానే —డాక్టర్ ప్రకాష్, అమ్మ అన్నట్లు నేను భగవంతుడు దూరం చేసిన దాంపత్య జీవితం తాలూకు మాధుర్యం గురించి చింతిస్తూ ప్రకృతి ప్రసాదిస్తోన్న సౌందర్యాన్ని ఆస్వాదించక జీవితం దుఃఖమయం చేసుకుంటున్నా నేమో!!

"అరుణా! ఏమిటి ఆలోచిస్తున్నావు?"

నా హృదయంలో చెలరేగుతున్న తరంగాల నెలా వ్యక్తం చేసేది?

"ఏమీ లేదు" అబద్ధమాడాను.

"పోనీ యిది ఆలోచించు. ఎక్కడో పశ్చిమ కనుమల్లో పుట్టిన కృష్ణ, ఎన్నో వందల మైళ్ళ ప్రయాణం చేసి, సముద్రంలో కల్సిపోవటం ఆశ్చర్యంగా లేదూ?"

నాకందులో ఆశ్చర్యమేమీ కన్పించ లేదు. నిజం దేవుడెరుగు.... నీరు పల్లమెరుగు..అన్నారు ఎత్తయిన కొండలమీద పుట్టినది పల్లంలో వున్న సముద్రంలో కలవక యింకెక్కడికి పోతుంది.

నా సమాధానం ప్రకాష్‌కి రుచించలేదు. — బహుశా అతని దృక్పథం వేరయి వుండాలి.

"కృష్ణనీరు మధురమని ఒప్పుకుంటావుగా?" సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనే సత్యం కాదని నేనందుకంటాను?"

"సముద్ర జలం ఉప్పగా వుంటుంది కదూ? ఉప్పు పరిశ్రమ ఆధర్మం మీదనేగా ఆధారపడి వుంది.

"మరి కృష్ణ సముద్రంలో కలిసిపోయి తన మాధుర్యమూ, ఉనికీ పోగొట్టుకొనటం ఆశ్చర్యంగా లేదూ?"

నిజమే! నేనెన్నడూ యీ విషయం యీ కోణంలో చూడలేదు. ఆశ్చర్యకరమైన విషయమే యిది.

"ప్రకృతి ధర్మమే అంత— అరుణా! తను అనుభవించి పొంది ఆనందించే కంటే త్యాగం చేసి తృప్తి చెందటమే జీవి వాంఛిస్తుంది."

మా యిద్దరి దృక్పథాల్లోని వైరుధ్యం అంతమైనట్లుగా రెండు కొండల మధ్యగా సూర్యుడస్తమించాడు.

ప్రియుని దర్శించిన పడతి చెక్కిళ్లలో ప్రతిఫలించే హృదయరాగంలా కన్పించింది సంజ కాంతుల్లో పరుగులు తీస్తున్న కృష్ణవేణి......

28 మార్చి 1959.

డాక్టర్ ప్రకాష్ ఆలోచన ఎంతో లోతుగా కన్పిస్తోంది.

—స్త్రీ తనను తాను పురుషునికి సమర్పించుకోవటం వ్యక్తిత్వం కోల్పోవటం ఎంత మాత్రమూ కాదు. జీవిత భాగస్వామి ఆనందం కోసం స్త్రీ తన సుఖం కొంత త్యాగం చేయాల్సిన అవసరం కల్గితే వెనుకాడ కూడదు. అందులో ఎంతో తృప్తి లభిస్తుంది.

ఎప్పుడో యాక్సిడెంటుకు గురి అయి సముద్రంలో పడిన వారు ప్రాణాలతో బయటపడి తిరిగి వస్తారనే ఆశ క్రమక్రమంగా ఆకాశంలో కలిసి పోతోంది.

ఎన్నాళ్లిలా సముద్రంలో మునిగిపోయిఆచూకీ తెలియని అతని కోసం నిరీక్షిస్తావ్? నిత్యమూ ఆనంద డోలికల్లో వూయలలూగాల్సిన దానివి నిరంతర నిరీక్షణతో జీవితం శూన్యం చేసుకుంటావా? ఇరవై సంవత్సరాలకే నూరేళ్ల జీవితం అంతమయినట్లా? — అంటుంది అమ్మ రోజుకు నాలుగు సార్లు.

డాక్టర్ ప్రకాష్ సహృదయుడు, భార్యా వియోగుడు, చదువుకున్నవాడు. సంస్కారి. నీవంటే ఎంతో ప్రేమగావుంటాడు.నిన్ను పువ్వుల్లో పూజిస్తాడు. ఇరవై ఏళ్లకే జీవితాన్నెందుకు శూన్యం చేసుకుంటావ్? — అంటారు నాన్నగారు రోజూ.

కృష్ణ తన మాధుర్యం సముద్రాలకి సమర్పించినట్లు — తనకోసం ఏడాదినాడు భార్యను కోల్పోయిన తన కోసం త్యాగం చేయలేవా?అని ప్రశ్నిస్తున్నారు. మోడుబారిన తన జీవితాన్ని చిగురింపచేయమని అభ్యర్థిస్తున్నారు. డాక్టర్ ప్రకాష్.

చదువుకునే రోజుల్లో వివాహం విషయంలో రాధ చేసే వాదన పదేపదే విన్పిస్తోంది — నీభర్త ఒక డాక్టరూ అంటే ఎన్నో ప్రాణాలను అపాయాల నుంచి, రోగాల నుంచి రక్షిస్తున్నాడన్న మాట. వారి ఆనందం కోసం, నీ సుఖం కొంత త్యాగం చేయుటంలో ఎంతోతృప్తి లభిస్తుంది నీకు.

ప్రొఫెసర్ సుధాకర్ యిక తిరిగి రావట్లే! ఆయన కోసం అమ్మా, నాన్నగారు అన్నట్లు ఎన్నాళ్ళ కంట్లో వత్తులేసుకు కూర్చుంటాను? ఇరవై ఏళ్లకే జీవితం శూన్యమనుకుంటూ భగవద్దత్తమైన శక్తి నెందుకు వృధాచేయాలి? మోడుబారిన జీవితం చిగురించేలా ఎందుకు చూడకూడదు? నూనె పోసే వారు లేక గుడ్డిగా వెలుగుతోన్న దీపం ఎందుకు శాంతివంతం చేయకూడదు?

రేపు డాక్టరు వస్తే ఒప్పేసుకుంటాను.... నన్ను నేను ఆయనకి సమర్పించుకొని ఇద్దరి జీవితాలను ఒకటిగా చేసి ఒక ఉపయోగం సాధిస్తాను. ఒక గమ్యస్థానం వేపు పయనిస్తాను.

• • •

గోడ గడియారం రెండు గంటలు కొట్టింది. ఎవరో తరిమి కొట్టినట్లుగా నల్లని మేఘాలు పరుగులెత్తుకుంటూ వస్తున్నాయి. రాబోయే తుఫాను సూచిస్తూ చల్లని (వాన) గాలి వీచ సాగింది. పున్నమి చంద్రుడు ఎక్కడో మాయమయ్యాడు.

అరుణ ఎంతగా ప్రయత్నించినా ప్రొఫెసర్ సుధాకరుని గురించి ఆలోచించకుండా ఉండ లేక పోతోంది. పదేపదే సాయంత్రపు సంఘటనలు — అతను టెలిఫోనులో మాట్లాడటం, బీసెంటు రోడ్డులో బట్టల షాపులో కన్పించడం, గుర్తుకు వచ్చి హృదయానికి ముళ్ళలా గుచ్చుకుంటున్నాయి.

యాక్సిడెంటునుండి ఎలా తప్పుకుని ప్రాణాలతో బయట పడ్డారు ? ఈ నాలుగేండ్లు ఎక్కడ వున్నట్లు? ఏమో అంతా భగవాన్‌కే తెలియాలి. పోనీ బతికి బయటపడ్డవారు వెంటనే తమకు తెలియపరిస్తే తనీ వివాహం చేసుకునేది కాదుగా ?

హే! భగవాన్ !

ఎలా ప్రొఫెసర్‌కు మొహం చూపటం ? ఏ మొహం పెట్టుకుని ప్రొఫెసర్ సుధాకర్‌తో మాట్లాడటం !!

ఈ రోజు విజయవాడలో చిన్ననాటి స్నేహితుడు ప్రకాష్‌నిచూసి, రేపు తనకోసం గుంటూరు వెళదామని ప్లాను వేసుకుని వుంటారు బహుశా !

అరుణ మనస్సు కళ్లెంలేనిగుర్రంలా పరుగులు తీస్తోంది.

డాక్టర్ ప్రకాష్ రాత్రి యింటికి రాలేదు. డిస్పెన్సరీలోనే ఉండిపోయారు. తను రాత్రి ఆలస్యంగా నిద్రపోవటంతో లేచేసరికిఏడుగంటలైంది. డ్రాయింగు రూంలోకూర్చునిపేపరు చూస్తోంది. వరండాలో బూట్లశబ్దం, డాక్టరుగారున్నారా ? అని అడుగుతున్నా రెవరో. ఎవరోకాదు— ప్రొఫెసర్ సుధాకర్!

భగవాన్ ! ఎలా ఇప్పుడు ? ఎలా ఆయన దృష్టినుంచి తప్పించుకొనటం ?

"డాక్టరుగారు లేరు. మీరు ఏదయినా కేసు విషయం మాట్లాడడానికి వచ్చారా ? " బాయ్ వివరాలు కనుక్కుంటున్నాడు.

"కేసు విషయమేమీ కాదు. డాక్టరుగారి స్నేహితుణ్ని. చూసిపోదామని వచ్చాను."

"అలాగా ! అయితే అమ్మగారు — అరుణమ్మగారు లోపల ఉన్నారు చెప్తాను ఉండండి."

ఈ బాయ్‌ని ఏం చేసినా పాపంలేదు.

"అరుణా! అరుణా!

ప్రొఫెసర్ సుధాకర్‌కు అర్థంకావడం లేదు. బాయ్ చెప్పేవిషయం. అరుణ — అరుణమ్మగారు ... ఇక్కడ డాక్టరు ప్రకాష్ యింట్లో వుండటమేమిటూ? నిన్న సాయంత్రం బట్టల షాపులో డాక్టరుప్రకాష్ అరుణభుజంమీద చెయ్యివేసి తీసుకువెళ్ళటంలో అర్థం .......

"అవునండీ ! కరుణమ్మగారు చనిపోయాక మా అమ్మగారు ... "

హే! భగవాన్! ఎందుకీ పరీక్ష నాకు ఏం పాపం చేశానని ?

"అరుణా ? మీ అమ్మగారు అరుణా ?" ప్రొఫెసర్ మధ్యలో అందుకున్నాడు.

ప్రొఫెసర్ సుధాకర్ లోపలకు వచ్చాడు.

"అరుణా! "

ఏమని చెప్పటం సమాధానం ? తను యిప్పుడు ఆయన భార్య అరుణ కాదు. మిసెస్ డాక్టర్ ప్రకాష్.

"ఎంతపని చేశావు అరుణా! నీకోసం నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఇంత దూరం వస్తే ఇదా నీవు ఆచరించే విధానం ? ఏం అన్యాయం చేశానని నీ వీ విధంగా నా జీవితంతో ఆటలాడుతున్నావు?

ప్రొఫెసర్ సుధాకర్ కంఠంలో వంచించబడ్డ బాధ ప్రస్ఫుటంగా ధ్వనిస్తోంది. అవమానించారన్న ఆవేదన హృదయాన్ని పిండుతున్నట్లు ముఖకవళికలు తెలుపుతున్నాయి. తట్టుకోలేక అనుభూతికి ప్రొఫెసర్ నిలువెల్లా కంపించిపోతున్నారు. దుర్బలహృదయం కూడా నాయును, కళ్ళు సజలలయ్యాయి.

లేదు ... లేదు ... తానీ పరిస్థితి నెదుర్కోలేదు. ప్రొఫెసర్ సుధాకర్ యిలాంటి దుర్బల పరిస్థితిలో చిక్కుకొనటం తను చూడలేదు. ఇలాంటి విషయ పరిస్థితి ఏర్పడనీయకూడదు తను ...

అందుకు తను ఏదో ఒకటి చేయాలి.

రేపుదయం సుధాకర్ వచ్చేవేళకు ఎక్కడికైనా, ఏ స్నేహితులింటికో వెళ్ళిపోవాలి. డాక్టర్ ప్రకాష్ ఎటూ యింట్లో ఉండరు కాబట్టి — తర్వాత కలుసుకోవచ్చునులే అనుకుని సరాసరి గుంటూరు వెళతారు తనకోసం ...

నాన్నగారు ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చున్నారు. బూట్లశబ్దం వినిపించటంతో పుస్తకం పక్కకు తప్పించి, ఎవరా అని చూశారు. ప్రొఫెసర్ సుధాకర్. ఉలిక్కిపడ్డారు. కళ్ళజోడు తీసి కళ్ళు నులుముకుని చూశారు. సుధాకరవునా, కాదా అని.

"అనుమానపడుతున్నారా ? నేనేనండీ ... సుధాకర్‌ని. ఎలా బతికి బయట పడ్డానని ఆశ్చర్యపోతున్నట్లున్నారు. అవును. తలుచుకుంటే నాకే ఆశ్చర్యమూ, భయమూ కలుగుతాయి. "

"రా ... రా! కూర్చో" అంటూ నాన్నగారు ఆహ్వానించారు కానీ, సుధాకర్‌ని చూస్తే, లోపల భయంగా ఉంది. తననీ, తన పరువు మర్యాదలను, కబళించివేయడానికి వచ్చిన కాలపురుషుడులా కన్పిస్తున్నారు నాన్నగారి కళ్ళకు.

ఏమి మాట్లాడాలో తెలీటం లేదు.


సుధాకర్ నాలుగు దిక్కులూ వేయి కళ్ళతో ఆశగా చూస్తున్నాడు. తనకోసం, నాలుగేళ్ళనాడు విడిచిపెట్టిపోయిన అరుణకోసం.

నాన్నగారు గ్రహించారు. సుధాకర్ అన్వేషణ. గుండెలు గొంతులోకి వచ్చాయి. ఏమని చెప్తారాయన, అసలెలా చెప్పగలరు? నోట్లోనుంచి మాట పెగిలి రావడం లేదు. శతవిధాలా ప్రయ



తీరాన కేరింతలు ....

—ఎం. డి. షిండే



విజయవాడలో కృష్ణవేణిపై వంతెన —కె. వి. యస్. ప్రసాద్

ల్పించి, విఫలుడై పోతున్నాడు.

''అరుణ కన్పించదేం ? ''

ఎదురు చూసి, చూసి సుధాకర్ అడిగాడు.

వార్ధక్యంతో ముడుతలుపడ్డ నాన్నగారిముఖం నల్లగా — అమావాశ్యపు ఆకారంలా మారి పోయింది. పాలిపోయిన పెదిమలు గాలివానకు వూగిపోయే తలిరుటాకుల్లాగా కంపించిపోతున్నాయి.

''సుధాకర్ ! ఈ ముసలివాణ్ని క్షమించాలి!''

తన అరవై ఏళ్ళ జీవితంలో ఎన్నడూ తలవంచని నాన్నగారు తలదించుకుని మొహం చేతుల్లో దాచుకుని, గద్గదస్వరంతో క్షమాపణ చెప్పుకుంటున్నారు .

హే! భగవాన్ !

వద్దు వద్దు నాన్నగారికి, ఈ ఎయసులో, ముసలితనంలో యింత కఠినశిక్ష వద్దు. అంతటి అగ్నిపరీక్షకు ఆయన సున్నిత హృదయం తట్టుకోలేదు. ! ...

మరేమిటి చెయ్యాలి తను ?

ఏమిటి? తనకు పరిష్కారమార్గం?

ప్రొఫెసర్ సుధాకర్ :

డాక్టరు ప్రకాష్ ! —

వీరిద్దరిలో ఎవరో ఒకర్ని ఎన్నుకుని వివాహానికి ఒప్పుకోవలస్సిన పరీక్షా సమయంలో డాక్టరు భర్తగా, తన ధర్మం సక్రమంగా నిర్వహించలేదు అనే అభిప్రాయం మీద నిలబడి పువ్వుల్లో పెట్టి పూజించే ప్రొఫెసర్, నారీహృదయం అర్థంచేసుకుని జీవితంలో వెన్నెల పండించే సుధాకర్‌కు సహధర్మచారిణి అయింది. కానీ ...

కానీ ... విధి మరోలా తన జీవితాన్ని మళ్ళించింది. ప్రొఫెసర్ సుధాకర్ యాక్సిడెంటుకు గురికావడంతో ఈజీవితం వృధాకాకూడదనుకుని, డాక్టర్ ప్రకాష్‌కు తనని తను సమర్పించుకుని, కొంత తృప్తి పొందుతోంది. అలానూ తను గమ్యం చేరలేకపోయింది. ప్రొఫెసర్ సుధాకర్ తిరిగి వచ్చారు.

తను తిరిగి మొదటికి వచ్చింది.

ప్రొఫెసర్ సుధాకర్ !

డాక్టర్ ప్రకాష్ !—

ఇద్దరిలో ఎవరికి తను దూరంగా పో గలదు? ఎవరి దగ్గరకు చేరగలదు అనాటి పరిస్థితులు వేరు కాబట్టి తన ఆలోచనా, స్వేచ్ఛా, ఉపయోగించుకుని, సమస్యను పరిష్కరించుకుంది. కాని.. కాని ... ఇప్పుడు ...

డాక్టరు ప్రకాష్ —

తగిన పోషణలేక ఎండిపోయిన జీవనలతకు లతకు పాదుచేసి నీళ్ళుపోసి, చిగురింపచేసిన చేతులతో, ఈ రోజున ఎలా త్రుంచివేయగలదు తను? నూనెపోసే బాధ్యత వహించేవారు లేక ఆరిపోతున్న దీపంలో నూనెపోసి నిలిపి, కాంతివంతం చేసిన తను ఈ రోజున స్వహస్తాలతో గాలిలో ఎలా పెట్టగలదు తను? శూన్యమనుకుంటున్న జీవితానికి ఒక అర్థమూ, ధ్యేయమూ చూపించిన మనిషి నీడ నుంచి ఎలా తప్పుకు పోగలదు తను ?

ప్రొఫెసర్ సుధాకర్! —

కన్నెహృదయం కన్న కలలను యువ్వనపు తొలి రోజులలో నిజాలుచేసి, దాంపత్య జీవితంలోని మాధుర్యం తొలిసారిగా లభింపచేసిన, అమృత హృదయుడు తనకోసం ఎంతోఆశతో వెదుక్కుంటూ వస్తే, ఆయనతో యింకొకరికంకితమయిపోయాను. మన రాగబంధం తెగిపోయింది' అని ఎలా చెప్పగలదు తను ?

తన హృదయాకాశాన వెన్నెలలు పండించిన సుధాకరునితో మన అనురాగ వల్లరులను ఏనాడో తెంపివేశాను.'మన ఋణానుబంధంతీరిపోయింది' అని ఎలా చెప్పగలదు తను ?

ఏది న్యాయం ?

ఏది అన్యాయం ?

నల్లని మేఘాలను మెరుపులు చీల్చివేస్తున్నట్లుగా న్యాయాన్యాయ విచక్షణ అరుణ హృదయాన్ని రెండుగా కోస్తోంది.

సమానమయిన బరువులు రెండువైపులా కలిగిన త్రాసు తాలూకు ముల్లులా అరుణమనస్సు ఒక క్షణం ఇటు తొణుకుతోంది, మరుక్షణంలో తప్పు దిద్దుకుని, రెండవ పక్కకు మొగ్గుతోంది.

వానగాలి ఉధృతంగా సాగింది. గాలివాన రాబోతున్నట్లు సూచిస్తూ, మేఘాలు గర్జిస్తున్నాయి.

అరుణ బాల్కనీలోనుండి లేచి, గదిలోకి వచ్చింది. డాక్టరు ప్రకాష్ రాలేదు. ఇంకా బహుశా ఈరాత్రికి రాడేమో: గడియారం మూడు గంటలు కొట్టింది.

జోరుగా కుండచిల్లి పడ్డట్లుగా వర్షం కురవసాగింది.

కిటికీ తలుపులు తీసి ఉండటంతో పక్కచాలా వరకు తడిసిపోయింది. హృదయ కవాటాలు తెరిచి

ఉంచిన తనలాగా.

ప్రొఫెసర్ సుధాకర్ స్టేట్స్‌కి రిసెర్చికి బయుల్దేరిన రోజున— వాల్తేరు ప్లాటు ఫారం మీద జీవితం ఎడారిలాగా కన్పించిన అక్షణం అలాగే స్తంభించి పోయింది. కాని అనుభవ శూన్యురాలయిన తను ఆవిషయం అర్ధంచేసుకోలేకపోయింది. ఎడారి బ్రతుకుకు డాక్టర్ ప్రకాష్ సన్నిధి ఒయాసిసులాగా లభించటంతో అలసి పోయిన,తను,సేద తీర్చు కుంటున్నది— ముందు చూపులేక. కాని.. కాని వెనక నుంచి హృదయం లేని విధి ఇసుక తుఫానులా తనని తరుముకుంటూ వచ్చి ఒయాసిసు ఒడ్డునయినా ఒకింత సుఖమూ, శాంతీ పొంద నీయకుండా ప్రొఫెసర్ సుధాకర్‌ని తెచ్చి పడవేసి కళ్ళలో ఇంత ఇసుక పోసి పోయింది కసితీరేలా.

తనః గత్యంతరం మేమిటూ ఇపుడు!

తగినంత ఆలోచన లేక తొందరపాటుతో ఒయాసిసు దగ్గర ఆగకపోతే ఈరోజు తనీ ఇసుక తుఫాను నుంచి తప్పించుకునేది! ఎలాగో ఎడారి యాత్ర కొనసాగిస్తూ ఉండేది.

కాని.. అనుభవశూన్యురాలయిన తను విధిచేత వంచించ బడ్డది. జీవితంలో పూర్తిగా పరాజితురాలయింది. తన చుట్టూ అల్లుకున్న గూడులో చిక్కుకున్న సాలెపురుగులాగా బయట పడలేక పోతోంది.

ప్రొఫెసర్ సుధాకర్:

డాక్టర్ ప్రకాష్:—

ఎవ్వరినీ కాదనే మనోబలం లేదు.

ఇద్దరినీ సమాధాన పరిచేందుకు, ఇద్దరూ సుఖశాంతుల. పొందేందుకు... తను చేయుదగ్గ ది ఒకే ఒక పని....

గబగబా లేచి టేబిల్ లైటు వేసి లెటర్‌మీద పది వాక్యాలు గిలికింది.

బయట హోరుగాలి సర్దుకుంది. జోరున కురిసే వర్షం తగ్గింది. ఋణభారం తీర్చుకున్న మేఘాలు తెలికపడి అక్కడక్కడ మెల్లగా తారాడుతున్నారు.

అరుణ గుండెలమీద బరువుదించుకున్నట్లు నిట్టూర్చి ... వ్రాసిన కాగితం కవరులో పెట్టి, అంటించి, కవరుమీద అడ్రసువ్రాసి, టేబుల్ మీద పేపర్ వెయిట్ క్రింద పెట్టింది.

గడియారం మూడున్నర చూపిస్తోంది.

మేడమెట్లు దిగి వచ్చింది మెల్లగా. క్రింద బాయ్ గాఢంగా నిద్రపోతున్నాడు. వంటమనిషి లోపల ఎక్కడో పడుకుని ఉంటుంది. అడుగులు అతి భారంగా పడుతున్నాయి. తన చేతులతో పెట్టి,పెంచి,పుష్పింపచేసిన మొక్కలు మవునంగా బొటబొటా కన్నీరు కారుస్తున్నాయి. విడిచి పోవద్దన్నట్లుగా ఆప్రక్కన ఉన్న కొబ్బరిచెట్లు తలలూపుతున్నాయి.

అరుణకు దుఃఖంతో గుండెలుబరు వెక్కాయి, కంఠం పూడిపోయింది. ఆగి వెనక్కి తిరిగి చూసింది.

మేడమీద లైటు ఒంటరిగా గుడ్డిగా వెలుగుతోంది.

పొద్దున్నే డాక్టరు ప్రకాష్ వస్తారు — ''అరుణా'' అని ప్రేమగా పిలుస్తారు. ఎవ్వరూ పలకరు. గదిలోకి పోయి చూస్తారు. నిద్రపోని మంచం ఏదో సందేశం మూగగా అందిస్తుంది. ఆయన హృదయం బావురుమంటుంది. కుప్పలా కూలిపోతారు. మంచినీళ్లు సయించవు, అన్నం తినరు—ఎవ్వరితోను మాట్లాడరు. రెండోసారి భార్యావియోగుడు.

''వద్దు ... వద్దు చిగురించిన లత ఎండిపోకూడదు ....''

అరుణ మనసు వెనక్కి పీకుతోంది.

అడుగు వెనక్కివేసింది.

ఏడుగంటలకల్లా ప్రొఫెసర్ సుధాకర్ చిన్ననాటి స్నేహితుడు ప్రకాష్‌ని చూడడానికి వస్తారు. తనని చూసి — ''అరుణా?'' అని పలుకరిస్తారు.

ఏం సమాధానం చెప్తుంది? అసలు మొహమెలా చూపిస్తుంది?

''వద్దు .... వద్దు''

మనసురాయి చేసుకుని బలవంతంగా హృదయం మరల్చుకుని ముందుకు అడుగువేసింది అరుణ!

* * *

డాక్టరు ప్రకాష్ అపరేషను పూర్తిచేసి డిస్పెన్సరీనుంచి ఇంటికి వచ్చేసరికి ఆరుగంటలయింది. ఎకాయెకిన మేడమీదికి పోయాడు. ''అరుణా!'' అని పిల్చాడు. సమాధానం లేదు. క్రిందికి పోయిందేమోలేఅనుకుని గుడ్డలు మార్చుకుంటున్నాడు.

పేపర్‌వెయిట్ క్రింద అరుణ దస్తూరితో తన అడ్రసు చేసిన కవరు!

హృదయం తీవ్రంగా స్పందించసాగింది.

కవరు చించి చదవసాగాడు.

''ప్రొఫెసర్ సుధాకర్ మీ కోసం నిన్న సాయంత్రం ఫోన్‌చేశారు. ఈఉదయం మిమ్మల్ని చూడటానికి వస్తారుట. ఆయన ఎదుటపడే ధైర్యంలేని పాపాత్మురాలిని నేను, ఆయనకు మొహం చూపించే అర్హత కోల్పోయినదానిని నేను. భగవంతుడు ఎందుకో నన్నింత విషమ పరిస్థితికి గురి చేశాడు? ఈజీవితానికి నేను నోచుకున్నది ఆరునెలలు సుధాకర్ పెన్నిధి, ఏడాది మీపెన్నిధి. ఎక్కడికి పోతానో ఏమో నాకూ తెలియదు ... నా కోసం వెతికించటం వృధాప్రయాసే అవుతుంది. క్షమించమని కోరటానికి కూడా నా కర్హత లేదు. ...''

డాక్టరు ప్రకాష్ ఆలోచనాశూన్యుడయాడు అర నిమిషంపాటు.

''ఎంతపని చేశావు అరుణా! నీవేం పాపం చేశావని అంత పిరికిదానివయిపోయావు? ఏంశం నేరం చేశావని ఇంత కఠినశిక్ష విధించుకొన్నావు? నేను మీ ఇద్దరి మధ్యా అడ్డుగా నిలుస్తానని ఎందుకనుకున్నావ్?''

నిమిషం తర్వాత అతని నోటెనుండి వెలు

దారి కాసిన తరువు — శ్రీపాద వెంకన్న



వడిన ప్రశ్నలకు ఎవరు సమాధానం చెప్తారు?— అరుణ లేదు!

పోలీసు రిపోర్టిద్దామని టెలిఫోన్ ఎత్తుతున్నాడు—ఎవరో హోటలు బాయ్ ఇచ్చిపోయాడంటూ, సర్వెంట్‌బాయ్ ఉత్తర మొకటి ప్రకాష్‌కందజేశాడు.

చించి చూశాడు.

''క్షమించు అరుణా! ఈ విషయం తెలిస్తే నేనసలు మీ మధ్యకు వచ్చి ఉండేవాడినే కాదు. ఎలా బ్రతికి బయటపడ్డానా అని మీరందరూ ఆశ్చర్యపడుతూ ఉండవచ్చు. యాక్సిడెంటుకు గురిఅయి సముద్రంలో పడ్డ తర్వాత ఓపికున్నంత వరకు ఒడ్డు కన్పిస్తుందేమో ఈదాను. చాలా దగ్గరకు వచ్చాను కూడాను. ఇంకొక రెండు నిమిషాల్లో ఒడ్డు చేరుకుంటాను. అంతలోకి పెద్దరాయి తలకు తగిలింది. స్పృహతప్పి పడిపోయాను. నేను ఈ లోకంలోకి వచ్చేసరికి నాలుగు సంవత్సరాలు పట్టింది. వెంటనే నీకోసం పరుగెత్తుకు వచ్చాను., కాని చాల ఆలస్యమయింది. నీవు మరొకరిదాని వయిపోయావు. నిజం చెప్పాలంటే నిన్న నీవు బట్టలషాపులో కన్పించిన క్షణంలో నన్ను నేను మర్చిపోయి ''అరుణా'' అని పిలిచాను. కాని .. కాని వెంటనే తెల్పుకొన్నాను. ప్రకాష్ నీ బుజం మీద చేయి వేయగానే. నీవు వెనకటి నా అరుణవి కాదు. మిసెస్ డాక్టరు, ప్రకాష్. ఎంతో బాధపడ్డాను. నన్ను నేను తిట్టుకున్నాను. అనవసరంగా నీ మార్గంలోకి వచ్చినందుకు. నేనెందుకు శాశ్వతంగా నిద్రలాంటి ఆ మతిమరుపులో ఉండిపోకూడదు? భగవంతుడు మనసిచ్చి ఎందుకీ విషమ పరిస్థితి కల్పించాలి?

నాలుగేళ్ళ క్రితం స్టేట్స్‌కి బయల్దేరి రోజు క్షణంలా గడుపుతూన్న నేను, నీకు దూరమై సుఖించకుండా చేశాను. నేను కల్గించిన ఆకష్టాన్ని, నేను చేసిన లోపాన్ని తీర్చాలన్న ఆకాంక్షతో మనసు బాగుపడగానే పరుగెత్తుకు వచ్చాను. కాని అందుకు పూర్తిగా భిన్నమయిన అనుభవం ఎదురయింది. నా రాక నీకు ఆనందం కల్గించవి, మాట అలా ఉంచి,నీవు అనుభవిస్తున్న సుఖమూ, సౌభాగ్యమూ, శాంతి—అన్నింటినీ దూరంచేసే దిగా పరిణమించింది.

విధి విలాసం:

నేను కోరుకొనేది నీ సుఖమే. డాక్టరుప్రకాష్ నీకెటువంటి లోపమూ చేయడు. జీవితంలో నీకెటువంటి కొరతా ఉండదు. నేను ఉదయమే ఈ వూరువిడిచి వెళ్ళిపోతున్నాను. ఇక ఈవైపుకు ఎన్నడూ తిరిగి రాను. నేనెక్కడున్నా భగవంతుణ్ని ప్రార్ధించేది నీ సుఖం కోసమే.

కాని ..... నేను నీమంచి కోరుకునేది ఒక్కటేను అరుణా! పొరపాటున తెలియక బట్టల షాపులో నేను కన్పించటంతో నీవు విచలితురాలవయి ఉంటావు. ఆ క్షణమయినా మనశ్శాంతి కోల్పోయి ఉంటావు. ఈ వేళకు కుదుటపడినా అందుకు నీ సుధాకర్ని—కాదు, కాదు క్షమించు నాకా అర్హతలేదు—ఈదైవోపహతుణ్ని క్షమించు క్షమించగల్గితే.లేదూ శపించు. అనుభవించటానికి సంసిద్ధుడనే !''

డాక్టర్ ప్రకాష్ రెండు ఉత్తరాల వంకా మార్చి మార్చి చూస్తుంటే రెండు కన్నీటి బొట్లు వాటిమీదపడి అక్షరాలను చెరిపి వేశాయి.

(ఈ కథకు ప్లాట్‌ఇచ్చి, వ్రాయమని ప్రోత్సహించినమిత్రులుశ్రీ కె.బి.యస్. ప్రసాదరావుకు కృతజ్ఞత) ★

